# బల్లకట్టు పాపయ్య

ఏకువజామున తొలికోడి కూసే యాల మెట్టపల్లి, సొట్టపల్లికి మయాన పార్తుండ కిట్టకాలవ గెట్టుమీన్నుంచి ఎవురయినా నిలబడి సూత్తాయింటుంటే, మెట్టపల్లి ఏపుల్నుంచి సీకట్లో బజనపాటలు యినిపించి, యింకూసేపుటికి డొంకల్లోంచి సేతి కర్ర పొడుసుకుంటా ఓ నల్లయిగ్గ్రహం మిట్టపల్లాలు ఎక్కిదిగుతా వొచ్చొచ్చి, కిట్టకావల గెట్టెక్కి ఆడ గొలుసుతో కట్టేసుండ బల్లకట్టుకాడికొచ్చి నిలబట్టం తెలుసుద్దన్నమాట. ఆ యిగ్గ్రహం బల్లకట్టు పాపయ్య.

పాపయ్యపని ఏకువజామున తొలికోడికూసే యాల్టినుంచి రేత్తిరి జనం తిరుగాట్టం మాటుమణిగేదాకా కిట్టకాలవలో బల్లకట్టు నడపటం. బల్లకట్టు ఉద్దోగమయినాక పాపయ్య బల్లకట్టు పాపయ్యయినాడు, ఆ సుట్టుపక్కల వూళ్ళ జనానికి, వుత్తపాపయ్యంటే పాపయ్య ఎవురికీ తెలవదు.

పెద్దమడిసి, నమ్మకస్తుడు, ఎవ్వరిజోలికీ పోడు, పద్దాకా బజనపాటలు పాడుకుంటా వుంటాడని వూళ్లో పదిమందీ అనుకుంటుంటే నెలకు అర్రూపాయల పావలాకాడికి బల్లకట్టు ఉద్దోగమయింది పాపయ్యకు.

పెళ్లాం బూసమ్మ కట్టిచ్చిన సద్దిమూట బల్లకట్టు లోనబెట్టి సెక్కమూతేసి, కాత్తె సలిగావుంటాన దుప్పటి అటనే కప్పుకుని, బొడ్డోంచి పుగాకు పాయదీసి వాసనసూసుకుంటా, యిప్పట్నుంచి బల్లకట్టుకు కరుసుకూకసోటం దేనికనుకుంటా కాలవగెట్టుమీన కూకుని సుట్టముట్టిచ్చి, జనం ఎవురన్నా వొత్తావుండారేమోనని సుట్టుపక్కల సీకట్లో సూత్తా......ఆలోశనలో పడ్డాడు బల్లకట్టు పాపయ్య.

ఇంగా జనం ఎవురూ తిరగాట్టంలేదే? ఏంజనమో, ఒకోక్కపాలి కోడి కుయకతలికేవొచ్చి తపనబడ్తా కూకుంటారు. ఇంకోపాలి రేత్తిరి యిట్టా యింటికెల్దామని బయిలెల్లి సగంలెక్క బోయినాక ఎవరోవొకరు దారిమయాన అడ్డుబడి 'గెడ్డాంపట్టుకుంటా కాత్తె కాలవ దాటేసెళ్ళు అన్ననాష్ట' అంటా పోకదీత్తారు— ఏ మద్దెలో! యియ్యాల పడవలేం రాటంలేదే? రాతారిబోటు వొచ్చేయాల యింది. యీ రాతారిబోటుదర్జా రవిలుబండికన్నా వుండదు. ఒచ్చి వొకటేమయిన బాకావూత్తా కూకుంటాయి జనాన్ని పోగుజెయ్యటానికి. యీళ్ల ఆర్బాటమేగాని యీడ జనం యిట్టా లంకడాల బోట్లెక్కకేం? యీరోజుల్లో యాడజూసినా బస్సులిట్టే

మా జోరుమీన లగెత్తుతుంటే, యీ రాతారివోటో రేందంటా మద్దెనా ? అయినా యిప్పటికీ కొంతమంది వుండార్లే ! అలవాటుమీనో, కరుజు తక్కువనో, మరదేమన్నా బకితో, పయానం పదిరోజులపాటయినా బోటెక్కిపోతావుంటారు. బల్లకట్టంటే దానిదారే వేరు. కాలవకు అడ్డంగా బస్సెడవోద్దీ ? ఒంటెన్లూ, బిర్జీలంటే యాడబడ్తే ఆడ ఎట్టుంటై ? యిట్టాటి కిట్టకాలవకు బల్లకట్టు లేకనేవోతే జనం అల్లాడిపోవల్సిందే ఎప్పటికయినా ! అసలు పొద్దుగూకులూ యిట్ట గుక్కెడిప్పుకోటానికి యీలవుద్దా బల్లకట్టు మడిసికీ ? ఓ కూరగాయల మడుసులేందీ పుగాకు, మిరబగాయ, నెయ్యి, ఎన్న, పాలు, పెరుగు, నాట్లజనం, కోతలజనం, ఆరేంది యీరేంది అన్ని యాపారాలూ యీ బల్లకట్టుమీన నడవాల్సిందేగా ? యియాల గొల్లజనం యింగా రాలేదేం దబ్బా ? ఆళ్ళొత్తే సరి కాలకడాలు, సేతిమురుగుల్తో బల్లకట్టుమీనంతా యుద్దెంచేసిపోతారు- అదొకరకం ! అనుకుంటా పుగాకుమైకంలో ఏందేందో రకరకాల ఆలోసెనలు సేసుకుంటుండ బల్లకట్టు పాపయ్యకు "ఓ ఏమియ్యోవ్ ?" అంటా సెవిలో టాప్పున బాకావూదినట్టు ఎవురో కాలవ అతలి గెట్టునుంచి అరిశారు.

వులిక్కిపడి, పరకాయించి సూశాడు బల్లకట్టు పాపయ్య, జనం సాగారనుకుంటా. కిట్టకాలవ అతలిగెట్టున ఎవురో గెడకర్రకుమల్లే వుండ యిగ్రహం తొందరమీన గావాలు కదం దొక్కుతా అరుత్తావుండాడు.

"ఓ బల్లకట్టు పాపయ్యోవ్-ఓ నిన్నేనయ్యోవ్? వుండావంటయ్యా ఆడా?" అనరిసింది అతలి గెట్టుమీన యిగ్రహం.

"ఆ ఆ, వున్నాలే—" అంటా వొళ్ళు యిరుసుకుంటా లెగిశాడు బల్లకట్టు పాపయ్య.

"వున్నావంటయ్యా ? నీ యిల్లు బంగారంగాను కాత్తె దొబ్బున రానీవయ్యా బల్లకట్టునూ, పొద్దెక్కుతుండదీ," అంది యిగ్రహం గబగబ.

"ఆహా అంత తొందరైతే ఎట్టా ? కాత్తె నిదానించవయ్యా నవు ఎవురువోగాని- యీడ బల్లకట్టు గొలుసు వూడదియ్యాలా, గెడ సేతికి తీసుకోవాలా, మరి కాత్తె నిల్దొక్కుకో" అన్నాడు బల్లకట్టు పాపయ్య, సేతులకు కాత్తె నోటి ఆవిరిపడ్తా.

"ఆఁ, అదెంతసేపులే సార్వీసయిన మడిసికీ ! గెట్టిగా రెండుతోపులు తోశావంటే అయిపాయె ! రానీరానీ దొబ్బున" అంది యిగ్రహం.

"మళ్లీ అదేమాటా ! ఎంతలెక్కనించి వొత్తుండావేం ?"

"యిప్పటికి రెండుకోసులు నడిత్తినీ యింగా రెండున్నరకోసులుపైసిల్కు పోవాలాయె, రానీ, రానీ." అంది యిుగ్రహం.

"నీ మడిసి దొంగల్దోల! రెండుకోసులు నడ్సినోడివి బల్లకిట్టుకు రెండు నిమిసాలు ఆగలేవంటయ్యా? మందేవూరేం?"

"దనియాలపాడు, ఎవురన్నా తెల్సా ఆడా?"

''బలేవోడివి! దనియాలపాడే తెలవదంటా? ఎంకటకిట్టయ్య బాగం డాడా?"

''చరేలే ఎంకటకిట్టయ్య మా మేనమామేగా! ఆయనకేం రాయికిమల్లే వుంటే మడిసీ! నాపేరు రాంకిట్టయ్యలే!"

గెట్టుకు బల్లకట్టు సేరీసేరకతలికే రాంకిట్టయ్య దడదడమంటా ఎక్కి కడ్డీమీన కూకుని, యిగ బల్లకట్టును పోనీ మన్నాడు.

''పోనిత్తాలే, యింగా మడుసులెవురన్నా వత్తుండారేమో సూద్దాం వుండు" అన్నాడు బల్లకట్టు పాపయ్య అటిటు సూత్తా.

"సూసేదేంది! యిగచరేలే! తెల్లారిపోయేదాకా యీగెట్టుకాడే కూకోబెడ్తా వెట్టా? నే నసలే సానాదూరం పోవాలంటుంటే ఆటిటు దిక్కుల్జూస్తా మాటిని పిచ్చుకోడేం; ఎమ్ ఎమ్ గెడేసి తొయవయ్యా దొబ్బునా నీ పాపయ్య బంగా రంగానూ! పుగాక్కాడ కావలెట్టా? యింద కాలుచ్చుకో, మడుసు లెవురన్నా వొత్తావుంటే మల్లీ తిరిగొద్దువులేగానీ నడుపు నడుపు!" అంటా రాంకిట్టయ్య కడ్డీ పట్టుకుని సిందుల్దొక్కాడు.

''ఎవురు జూసినా యిడిగిదీ వరస, పద్దాక ఆటిటు బల్లకట్టు నడపటమంటే మాటలంటయ్యా? కాలవ పారుదల సూడు ఎట్ట తోస్తావుండదో? పుగాక్కాడకేం గానీ ఓ కానీ బిల్లకూడా వుంటే సూడు ఎందుకయినా పనికొచ్చుద్ది" అన్నాడు బల్లకట్టు పాపయ్య బల్లకట్టు నడుపుతా.

''సిల్లరేం వుండట్టులేదే– ఎల్లుండి మల్లీ తిరిగొత్తాగా, అప్పుడిచ్చిపోతాలే, కానీ యాడికిపోద్ది! అయితే బల్లకట్టు పాపయ్యన్నా! మనకి నెలకి జీతం ఎంతొచ్చుద్దంటా?"

"ఆఁ, వుంటదిలే దెగ్గిర దెగ్గిర ఆర్రూపాయిల పావలా – ఏంసాలుద్ది సచ్చి?"

''పరవాలేదే? ఎప్పటికయినా డబ్బు డబ్బే! పైన ఏమాత్రం?" అన్నాడు రాంకిట్టయ్య.

"పైనేంది ?" అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"ఆఁ, అదలే, పైన కాత్తెకూత్తె సంపాదనవుంటది కావాల్నుగా? అటీటు వొత్తా పోయే జనం ఆదిదంటా ఏవన్నా యియరంటయ్యా ?"

"అదిదేంది ? యిప్పుడు నీ సంగతేంది సెప్పరాదూ ? ఎల్లుండి సిల్లర మార్చి తెత్తానంటుంటివి! అదిగంతే పైసంటే."

"ఆర్నీ బల్లకట్టు పాపయ్య దెబ్బతీశాడే ! అయితే మాటంటే నమ్మకం లేదంటావ్ ? సరే నువె సూత్తావుగా ఎల్లుండీ. అయితే నీకు పెల్లాం బిడ్డలుండారా? వుండక యాడికి పోతారనుకో ! యింటికి మల్లీ ఎప్పుడుపోతా ? రెత్తిరి బాగా పొద్దెక్కద్దేం ? మరి బల్లకట్టు పనంటే యిగనంతేగా ! తెల్లారి సీకట్లో వొత్తా సద్ది బువ్వ తెచ్చుకుంటావుగావల్నా. మరి మద్దానం బువ నీ పెల్లాం తెచ్చుద్దేం ? సెప్పిన మాట యింటదా నీ పెలాం ? యినక ఎట్టుంటదనుకో ! పిల్లలెంతమందీ ? నీకు నలబై ఏళ్ళుంటయ్యనుకుంటా - అసలు. నలబయ్యేన్నా లేంది బల్లకట్టు పనికి పనికిరారనాల్చిందే - గట్టుకు చేర్చట్టుందే? మంచోడివిలే అన్నా - ఎవురో అప్పుడే తట్టలెత్తుకొస్తుండారే కోకలెగ్గట్టీ? ఆర్నీ గొల్లజనం! బల్ సందడి గుంటదిలే- అవులెలుండి యిత్తాలే కానీబిల్లా - ఎల్తుండా బల్లకట్టు పాపయ్యో న్నోవ్," అంటా పటపట మిరపగాయలు ఏసినట్టు మాటలు దులిపి, గెట్టుమీనకి దూకి గొల్లజనాన్ని ఓసూపు సూత్తా, అంగలేసుకుంటా గెట్టు దిగి దొంకల్లోబడి మాయమయ్యాడు రా కిట్టయ్య.

"ఓ బల్లకట్టు పాపయ్యన్నోవ్ ? యిటేవుండావంటయ్యా ? నీకు పున్నెం వుంటది కాత్తె ఆదరికి దొబ్బునపోనియి బాబూ, అప్పుడే తెల్లార్తుండది ! నాగరత్తీ రాయే దొబ్బునా ! చుబ్బక్కా, లచ్చుమ్మా రాండి రాండి - ఎంకాయి పిన్నాం ఏదీ? ఓ చీతామోవ్ లగెయ్ లగెయ్ !" అంటా గొల్లజనం కడాలు, గొలుసులు కొట్టుకుంటా, మట్టెలు టక్ టక్ మనిపిస్తా, పెరుగోసన గబ్బునవిపిస్తుంటే, రవిలు బండి పెట్టెలకుమల్లే తోసుకుంటా వొచ్చి బల్లకట్టుమీన నుంచుండారు సోల్పున మానికా, తవ్వా, సోల, గిద్దలకిమల్లే.

"అంతా వొచ్చారా యిగా ఎవురన్నా పొదలసాటున వుండారా ?" అన్నాడు బల్లకట్టు పాపయ్య గెడమీన ఓరగా ఆనుకుని సూత్తా.

"పొదలసాటేన్నందయ్యోవ్ ? సింతసచ్చినా పులుపు సావలేదంట ! యీ బల్లకట్టు పాపయ్యకు ఏళు మిగులుండా సెతురు తగ్గటంలేదే? నవుతావు దేనికే నాగరత్తీ? మరి సూడమ్మా యీ పాపయ్యకు తెల్లారిందప్పుడే సెతురాడనూ,"

అంది ఎంకాయి పిన్నాం.

"అదేంటి పిన్నాం అట్టంటదేం ? గెడక్రరకుసుల్లే పాపయ్య అట్టంటే ఏళ్ళు మిగల్లమేంది పాపం- యిహి హిహీ-" అంది నాగరత్తి కొంగుచాటు పక పకమంటా.

"అదేంది పిల్లోవ్ అట్టిరగపడ్తుండావు? ఆ పొళ్ల కాత్తారాలి కాలవలో పడేను!" అంది చుబ్బక్క.

"అదేంది చుబ్బమ్మోవ్ అట్టంటావ్? దాని పళ్ళుసూసే పుల్లన్న దాన్ని కట్టుకుంటే!" అన్నాడు బల్లకట్టు పాపయ్య గెడేసి బల్లకట్టు నడుపుతా.

"సూడే ఎంకాయిపిన్నాం యీ పాపయ్య? నన్నంటే అన్నావుగానీ యింటికాడ మా బూసమ్మొదినకాడ అనేవయ్యోవ్ బద్రం వోళ్లంతా పిడకలు కొట్టుద్దీ!" అంది నాగరత్తి.

"అయితే పద్దాకా యీ పుత్తకబుర్లేనా లేకపోతే యియ్యాలన్నా కాత్తె పెరుగు సద్దిబువలోకి పోత్తారా?" అన్నాడు బల్లకట్టుపాపయ్య.

"కాత్తె పొయిరాదంటే నాగరత్తీ?" అంది లచ్చువమ్మ.

"ఆఁ, నువు పొయరాదూ సాటుగా మూలకూకుండావుగానీ? యియ్యాలసలే నా పెరుగు తగ్గింది ఏం మాటొచ్చుద్దో, పిన్నాంకాడ ఏమన్నా దొరుకుద్దేమో?" అంది నాగరత్తి.

"చరే నాసంగతి పాపయ్యన్నకే తెల్సు" అంది ఎంకాయిపిన్నాం.

"పులుపు సిచ్చుగుండది మరీ యియాల నాపెరుగు! మరీ యిదెట్టపొయనమ్మా- కాదంటే చుబ్బక్కా?" అంది సీతాం.

"యిదిగో మద్దె మీరెందుగ్గాని కొట్టుకోటం గెట్టొచ్చింది దిగండి దిగండి; మీసంగతి యియాల నాకేమన్నా కొత్తెట్టా? రత్తమ్మ వొత్తావుంటే మిమ్మల్ని అడక్కనేపోదును. పోనిగానీ ఎవురో ఒకరు రేపన్నా కాత్తెపోసి పొండి," అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"ఓ, రేపు తప్పకుండా నలుగురం నాలుగింతలు పోసిపోతే సరిగా—దిగరేమే యింకా కూకుండారూ? రాండి రాండి పొద్దెక్కిందీ-" అంటా తోసుకుంటా గెట్టుదిగి ఎల్లిపొయ్యారు గొల్లజనం.

అటిటు సూసి దగ్గిర్లో జనం ఎవురూ లేకపొయ్యేతలికి యాప్పుల్ల యిరుసుకుని నోట్లోపెట్టుకుని, గెట్టుమీద కూకుండాడు బల్లకట్టు పాపయ్య.

సంకురేత్తిరి దగ్గిరకొస్తుండది యిగ కోతలజనం సాగుతారనుకుండాడు

పాపయ్య. యాడ జూసినా వొడ్డగింజ అగుపిస్తావుంటది. దొబ్బున కోతలొస్తే బాగుండుననుకుంటాడు పాపయ్య. అయినా యీ కూలిజనానికి తగువాడుకోడంతోనే సరిపోద్దిగాని పక్కవోడిమాట యినిపిచ్చుకోనే యినిపిచ్చుకోరు.. ఆదేమంటే ఆసాములు కూలిగింజలు సరిగా కొలవటం లేదంటారు. ఎంతసెడ్డా ఆళ్ళు కూలి జనమేగా మరి? మిరపగాయ దర పెరిగిందంట. పద్దాకా బల్లకట్టు తొందరేగాని ఏమన్నా యియ్యమంటే రేపు రేపంటాడే ఎప్పుడు సూసినా 'యీ రంగయ్య? ఆరోరికి తోస్తే ఏమన్నా యిచ్చిపోతుండాల్సిందేగాని గెట్టిగా ఎవుర్ని మటుకేం నిలవదీస్తా, తప్పుగాదూ? బల్లకట్టు ఎక్కనియ్యకుంటానికి నాయబ్బసొమ్మేట్టా బల్లకట్టూ? యింటో సూడవోతే యీ బూసమ్మ నే నేమో మూటలు కట్టుకు గాటం లేదనుకుంటది. యిక్కడి యవారం నీకు తెలవదులే అంటే నీకు నోట్లో నాలిక లేదంటది. యింటోవుండే ఆడగూతురుగదక అనామాటన్నది. "యీ బాగ్యానికి చీకట్లో ననంగా లెగిసెల్లి వూరు నిదరబోయినాక తిరిగి రావాలా?" అంటది. సీకట్లో లెగిసొస్తుంటే పంచపట్టుకు గుంజుద్ది తెల్లారినాక పోవచ్చులే అంటా. పద్దాకా మంచంలో కూకుంటానికి ఎనక తింటానికి నీ కేవన్నావుంటే గదా? ఏందో, దాని రంపి దాన్దేగాని యినకాడ యవారం కాత్తైన్నా తెల్చుకోకర్లా? చుబ్బయన్నా అగుపియటంలేదే కాత్తె అప్పేసన్నా యిత్తాడేమో అనుకుంటే? అనాపజాన ఎటెటుగానో ఆలోసెనల్లో బడిపోతుండాడు బల్లకట్టుపాపయ్య.

"ఓ బల్లకట్టు పాపయ్యన్నోవ్, రావయ్యో, రావయ్యో అతలేపు కెల్లి అటనే కూకుండావూ?" అంటా అరుస్తా అతలేపు జనం గట్టెక్కటం సూసేతలికి వులిక్కిపడి లెగిసి తెడ్డుతీసుకుంటాడు బల్లకట్టు పాపయ్య.

"మీ అమ్మ రాలేదేరా కొండయ్యో? అంతలావుపనేం జేత్తుండ దబ్బా యింటికాడా!" అన్నాడు బల్లకట్టు పాపయ్య, కొడుకు కొండాయి మజ్జానం బువ్వ దెచ్చి ఏపసెట్టుకింద పెట్టేతలికి.

"బట్టలు గుంజుకోవాలంట" అన్నాడు కొండాయి.

"బట్టలు యిప్పుడే గుంజుకోవాలెట్టా? నువు బువదిన్నావంట్రా?" అన్నాడు పాపయ్య బువకాడ కూకుంటా.

"తిన్నానయ్యో, అదేమో నేను బెచ్చాలాడుకుంటుంటే వొచ్చి బువతీసి కెల్లని అమ్మకొట్టిందే!"

"అయితే ఎప్పుడూ బెచ్చాలేనంట్రా నువాడేదీ?"

"బిల్లంగోడుకర్ర సుబ్బాయి తీసికెల్లాడు."

'చీ యదవా ఎప్పుడూ ఆటలేనంటుంటే !"

"నిన్నా, యియ్యాలేనయ్యా నే అడ్తుండదీ! అయ్యోయ్! బర్లోకి పంపిత్తా నంటివే ?"

"ఎట్టపులే. బడి సూకిరిపోద్ది ? యిదిగో యీపాలి గెట్టిగా పంతుల్తో సెప్పి బళ్లో సేరిపిత్తే సరిగా! మరి ఎప్పుడు సెప్పినా పైనొచ్చే మంచిరోజున సేరిపిత్తా నంటాడేగాని మరామంచి రోజు ఎప్పుడొచ్చుద్దో యిన్నాలకి తేలకపోయె! సివరికి సేతిలో యావన్నా పెట్టమంటాడో ఏందో మరి ? యిదిగో యీపాలి అదేదో గెట్టిగా నిలేసి తేల్చుకుంటాగా. ఒరే కొండాయ్ !"

"ఏందయ్యా ?"

"అయితే మీ అమ్మ యింటికాడ ఏంజేసుద్దంటా ?"

"బట్టలు గుంజాకోవాలంట."

"ఇప్పుడే బట్టలు గుంజాలెట్టా? బువ దీసుకుని కూసేపు యిటొచ్చిపోతే కాళ్లేం అరిగిపోతయ్యా? ఒరే కొండాయ్ !"

"ఏందయ్యా?"

"రేపు మజ్జానం మీ అమ్మనే బువపట్టుకు రామను."

"రేత్తిరి అమ్మతో నువే సెప్పరాదంటయ్యా ?"

"పరవాలేదులే సెప్పమంటూంటే ?"

"నాకేం. అయ్యా సెప్పమన్నాడని సెబుతా."

"చా ఎదవా పొత్కురాత్రయి సెప్పావంటే తెల్సిందా? ఎవురో వొచ్చి అప్పుటే బల్లగట్టుమీద కూకుండారే! కాత్తె వుండవయ్యా బువదింటుండానూ" అంటూ బువ తీసుకురాటానికి బూసమ్మ పాలుమాల్తుండదని చిరాకుబడ్తా బువ కాణ్ణుంచి లెగిశాడు పాపయ్య.

* * *

ఓరోజు బాగా రేత్తిరయినాక బల్లకట్టుపాపయ్య యింటికెల్దామని గెట్టుదిగే సమయానికి అవతలిగెట్టునుంచి పొరుగూరు ఎల్లివస్తావుండ సుబ్బయ్య గొంతు యినిపించింది.

"రా, రా, సుబ్బయ్యన్నా - యింగా నయం యిప్పుడే బల్లకట్టేసి గెట్టు దిగపోతుండా - ఎన్నాలయిందీ సూసీ! ఏవూరెల్లావూ ఎందికతా రా, రా—".

సుబ్బయ్యను యివతలి గట్టుకు సేర్చి మళ్లీ బల్లకట్టు గొలుసు బిగిచ్చాడు పాపయ్య.

"కూసేపు కూకునెల్దాం కూసో పాపయ్యా. అబ్బ నడిసి నడిసి సిహరికి మనూరి సాయలకొచ్చేతలికి పోయిన పానం మళ్లీ తిరిగొచ్చిందంటే నమ్మ! కాళ్లు గుంజుతుండై. కూసేపు కూకుని పోదాంలే వుదూ—అంతంగిరాల్లో బాకీవుంటే పోయినాలే - కూకో, కూకో నీపెళ్ళాంతో నేను సెబుతాలే" అన్నాడు సుబ్బయ్యా గట్టుమీన సాగిలపడ్తా.

"ఆఁ, అదసలే గుబులు మడిసి" అన్నాడు పాపయ్యా పొద్దు సానా పోయిందనుకుంటా.

"కాదుమరీ! ఎంతసెడ్డా పెల్లామాయె. యిదిగో మనగాడి లంకపుగాకుండది ఓ పాయసుట్టిసూడు - కూకో—నాకాడ సెకుముకి వుండదిలే."

సుబ్బయ్యా, బల్లకట్టు పాపయ్యాలు సుట్టలు ముట్టిచ్చి కూకుండారు, సీకట్లో కోటయ్యా కొండమీద శికరాలకిమల్లే.

ఆ పజాన కూకుని సుబ్బయ్యా బల్లకట్టు పాపయ్యాలు ఏమ్మాట్టాడకుండా సుబ్బయ్యా పాపయ్యాతో సెప్పిన అస్సల్సంగతిది:

"పుగాకు అమ్మకం బెట్టిన వన రత్తయ్యాను ఎరుగుదువుగా?" అన్నాడు సుబ్బయ్యా.

"అదేంది సుబ్బయన్నా, రత్తయ్యానే ఎరగనంటా!" అన్నాడు పాపయ్యా.

"నీకు ఎందుకు తెలవదుగానీ, అయితే యీ సంగతి యిన్నావా?" అన్నాడు సుబ్బయ్యా.

"అదేందో నాకేం తెలుసుద్ది సెప్పందీ?" అన్నాడు పాపయ్యా.

"రత్తయ్యా పెల్లాం కాంతమ్మ ఆ పొరిగింటి ఈరబెమ్మం పిలుస్తే దేశాంతరా లెల్లిందట!" అన్నాడు సుబ్బయ్యా

"చా!" అంటా నోరు దెరిశాడు బల్లకట్టు పాపయ్యా.

"చా ఏంది! రెండు మూడు దినాలు కప్పెట్టారు. చివరికి గుబ్బలెగిసింది" అన్నాడు సుబ్బయ్యా సుట్టపొగ పంటి సందుల్నించి వొదుల్తా.

"అదేంది - కాంతమ్మ—!" అంటున్నాడు పాపయ్యా యింకా తెప్పరిల్లక.

"మంచిదేమరి! ఏమయినా యివన్నీ మనమాటల్తో కట్టుబడుండే యవారాలు కాదు సూడూ! ఈ రత్తయ్యేమో నాలుగు డబ్బులు సంపాయిచ్చుకొద్దామని రెండు మూడు దినాలపాటు పొరుగూరు ఎల్తావుంటాడూ, మరి యీ మద్దెన ఈరబెమ్మం ఏం పసరుపూశాడో ఏమో - కాంతమ్మ కాస్తా మాయమయింది!" అన్నాడు సుబ్బయ్యా.

“అంతా మాయగావుంది!” అన్నాడు పాపయ్య.

“ఇదిగో మన్లోమాట – మనూరి రంగయ్యకు నువేమన్నా బాకీ పడ్డా వుంటివేట్రా పాపయ్యా?” అనడిగాడు సుబ్బయ్య.

“అం వుంటే రూపాయో, రెండో వుంటదిలే” అన్నాడు పాపయ్య.

“అబ్బే ఏంలేదుగనీ వాడి గుణం మనూళ్లో అందరికీ తెల్సిందే గదా? అంనవు యింట్లోలేనప్పుడు ఎల్లి నీపెల్లాం బూసమ్మను ఏదించుకుతింటాడంట. అద్ది అడిగి పారెయ్యరాదూ పీడా వొదుల్తుంది – మాట్లాడుకుంటా ఎల్దాం లెగు పొద్దుపోతుందదీ” అంటా పంచ దులుపుకుంటా లెగిశాడు సుబ్బయ్య.

“ఓ బల్లకట్టు పాపయ్యన్నోవ్? బాబ్బాబు కాస్త బల్లకట్టు యివతాడికి రానియ్యి నాయనా సానాపొద్దు పోయ్యొచ్చాము” అనరిశారు ఎవురో అతలి గట్టునుంచి.

* * *

ఆరేత్తిరీ, మరసనాడు ఏకువజామునా బల్లకట్టు పాపయ్య బొనపాటలు ఎవురికీ యిన్నాలా.

వజ్జానం బుగదెబ్బిన కొండయికి బల్లకట్టు వొప్పజెప్పి, వెట్టపల్లికి గబగబఎల్లి, తనింటోనించి రంగయ్య సుట్ట ముట్టించుకుపోతుంటం సూసిన బల్లకట్టు పాపయ్య ఎల్లి పెళ్ళాం బూసమ్మ వొళ్ళు పచ్చడిజేసి బల్లకట్టుకాడికొచ్చి యిగ అడనే గెడకఱ్ఱ తీసుకు కూకుండాడు.

ఆ నిశిరేత్తిరి కిట్టకాలవగెట్టుకాడికొచ్చి, పాపయ్యకెదురాగ్గా నిలబడ్డది పెల్లాం బూసమ్మ కొడుకు కొండాయితో.

“ఇంటికి ఎల్దాం రా” అంది బూసమ్మ ఏడుస్తా.

“దెగ్గిరకొచ్చావంటే సంపుతా – ఎల్లు” అన్నాడు పాపయ్య.

“సంపు. సంపి యీ కిట్టకాలవలో పారెయ్యి నన్ను. నే నేపాపం ఎరగను, నీ కేందో గబుబు తిరిగింది” అంది బూసమ్మ.

“ఎవురికి తిరిగిందో యియాల తేలుత్తా” అన్నాడు పాపయ్య.

“నవు ఏందేల్చినాసరే నేను యీడే పానం వొదుల్తా” అంది బూసమ్మ.

ఆ వజాన ఏంజరిగినా జరగనీ – రేత్తిరి మూడుగంటలయాలకు బల్లకట్టు పాపయ్యను ఎంటబెట్టుకుని కొండాయితో యింటికి సేరింది బూసమ్మ.

అప్పట్నుంచి కొన్నేళ్ళు అయ్యా, అమ్మకు బెడుస్తారావటం కొండయ్య సూస్తావొచ్చాడు.

''ఒరే కొండయ్యా!'' అని ఓనాడు కొడుకును పిలిశాడు మంచంలో కూకుండ బల్లకట్టుపాపయ్య.

''ఏందయ్యా?'' అన్నాడు కొండయ్య.

''రేపట్నుంచి యిగమీదట బల్లకట్టుపని నువు సూసుకో. నాపని అయిపోతుండది'' అన్నాడు బల్లకట్టుపాపయ్య.

''నాపెల్లాం బల్లకట్టు పని వొద్దంటున్నది'' అని సెప్పాడు కొండయ్య.

మరసనాడు కోడితోపాటు లెగిసి, పెల్లాం కట్టబెట్టిన సద్దిమూట తీసుకుని క్రరపొడుసుకుంటా బజనపాటలు పాడుకుంటా ఎప్పటికిమల్లే కిట్టకాలవ బల్లకట్టు ఏపుగా ఎల్లాడు బల్లకట్టుపాపయ్య.

*